క్లుప్తంగా

రేపు వైఎస్సార్‌ సీపీ కార్యకర్తల సమావేశం

రామసముద్రం : మదనపల్లె మిషన్‌కంపౌండ్‌లో శుక్రవారం జరిగే ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌ రెడ్డి సభను విజయవంతం చేయాలని సీకెఎం ఉడా చైర్మన్‌ ఎస్‌.వెంకటరెడ్డి యాదవ్‌, వైఎస్సా ర్‌సీపీ సీనియర్‌ నాయకులు అక్కులప్పలు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశానికి మండలంలోని ప్రతి ఒక్క కార్యకర్తలు , ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కలికిరిలో గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి : పట్టణంలోని కలికిరి-1 గ్రామ సచివాలయం పరిధిలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ రమేష్‌ కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కొత్తపేట వీధి, కోటవీధి, పాతసంతగేటు వీధి, ఆర్‌.ఎస్‌.రోడ్డు, చర్చి వీధి, పాత పోస్టాఫీసు వీధి, జంగంవీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించి ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం



ఆర్టీసీ డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

వాల్మీకిపురం : ఆర్టీసీ డ్రైవర్స్‌ డే సందర్భంగా స్థానిక ఎన్టీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లు, కండక్టర్లకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు పెద్దప్పరాజు, రేణుక, నజుముద్దీన్‌, ప్రవీణ్‌, సుబ్రహ్మణ్యం, షబీనా, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్‌ విజేత కురబలకోట జట్టు

తంబళ్లపల్లె : స్థానిక జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్రా వాలీబాల్‌ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీఎం, కొత్తకోట, కురబలకోట మండలాల నుంచి ఆరు జట్లు పాల్గొన్నారు. కురబలకోట జట్టు విజేతగా నిలిచింది.

మొరుసుకాపులకు బీసీ సర్టిఫికెట్స్‌ ఇవ్వాలని వినతి

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం జీఓ.నెం.33 ప్రకారం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో నివసిస్తున్న వక్కలిగర(మొరుసుకాపు) కులస్తులకు బీసీ-బీ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా తహసీల్దార్‌లను ఆదేశించాలని వక్కలిగర సంఘం నాయకులు ఆర్డీఓ ఎం.ఎస్‌.మురళికి వన్నవించారు. బుధవారం సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీఓను కలిసి రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కులగణన సర్వేలో వక్కలిగర కులస్థులకు జీఓ 33 ప్రకారం బీసీ-బి కింద నమోదుకు అవకాశం కల్పించిన నేపథ్యంలో తమకు క్యాస్ట్‌ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేకి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఇందిరమ్మ, తదితరులు

పెద్దమండ్యం: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా నివాళి లర్పించారు. ద్వితీయ వర్ధంతి సందర్భంగా కలిచెర్ల బస్టాండు కూడలిలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఘాట్‌ వద్ద మాజీ ఎమ్మెల్యే సతీమణి కడప ఇందిరమ్మ, నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళిలర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం కలిచెర్ల పాతూరులో క్రికెట్‌ పోటీలను మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుర్రం రమేష్‌ ప్రారంభించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి రూ. 10 వేలు, రన్నర్‌లుగా నిలిచిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ బుక్కే పీరమ్మ, మండల కన్వీనర్‌ చాంద్‌బాషా, ఆర్‌బికే చైర్మన్‌ కలిచెర్ల చాను, మండల సచివాలయ కన్వీనర్‌ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, మొలక బయ్యారెడ్డి, విశ్వనాథ, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట



పెద్దతిప్పసముద్రంలో మాట్లాడుతున్న ఎంఈఓ నారాయణ



తంబళ్లపల్లె: మెమొంటో అందజేస్తున్న సీడీపీఓ నాగవేణి



వాల్మీకిపురం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ రోహిణి



కేవీపల్లె : సొరకాయలపేటలో బాలిక దినోత్సవం



నిమ్మనపల్లె: మాట్లాడుతున్న ఎస్‌ఓ మునివెంకటమ్మ



మదనపల్లె: మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

పెద్దతిప్పసముద్రం : బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంఈఓ నారాయణ నారాయణ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా బుధవారం ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు జయరాణి, నాగరత్నల ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బాలికా హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ, ఎదుగుదల, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

బాలికా విద్యకు ప్రాధాన్యత

బి.కొత్తకోట : బాలికలు చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకునేలా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక సీడీపీఓ కే.భాగ్యమ్మ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీబాలికల హైస్కూల్‌లో బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య, భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. బాల్య వివాహలు నేరమని, దీనిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ హిజాద్‌ప్యారీ, హెచ్‌ఎం భాస్కర్‌ పాల్గొన్నారు.

విద్యతో బాలికల అభివృద్ధి

తంబళ్లపల్లె : ఉన్నత విద్యతో బాలికల అభివృద్ధితో పాటు వారి కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని ఐసీడీఎస్‌ సీడీపీవో నాగవేణి తెలిపారు. బుధవారం కస్తూర్బా బాలికల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలిక హక్కులు, చట్టాలు, జెండర్‌ సమానత్వం, ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాలపై వివరించారు. వ్యాస రచన పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, మెమొంటోలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ శ్రీమతి, టీచర్లు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం

పెద్దమండ్యం : బాలికా విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఫోర్డ్‌ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్‌ ఆవుల నరసింహులు అన్నారు. మండలంలోని శిద్దవరం కెజీబీవీ బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికల విద్యకు, భద్రతకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను, చట్టాలను అమలు చేస్తోందన్నారు. బాలికల విద్యకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. విలువలతో కూడిన పెంపకం ఉన్నప్పుడే బాలికలకు భద్రత ఉంటుందన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ నాగలక్ష్మీ, కెజిబివి ఎస్‌వో రాణి కుమారి, ఫోర్డ్‌ సంస్థ సిబ్బంది రెడ్డెమ్మ, అనిత, భువనేశ్వరి, రమణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది

వాల్మీకిపురం : బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక జిల్లా పరిషత్‌ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం స్థానిక పాఠశాలలో బాలికను చదివిద్దాం .. బాలికను రక్షిద్దాం అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల నష్టాలు కలుగుతాయన్నారు. బాలికలకు విద్య అవసరమని, సమాజంలో ఏ విషయాలను తెలుసుకోవాలన్నా అది విద్యతోనే సాధ్యమని విద్య ప్రాముఖ్యతను మనందరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలను అడ్డుకోవాల్సి ఉందని, వీటిని ఏ విధంగా అరికట్టాలో వివరించారు. బాలికలను ఏదైనా ఆపద సంభవిస్తే తక్షణమే టోల్‌ఫ్రీ నెంబర్స్‌ 1098, 100, 181లను సంప్రదించాలని సూచించారు. అలాగే స్థానిక డాక్టర్‌ బిఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలలో ఐసిడిఎస్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కల్పన, సూపర్‌వైజర్‌ రోహిణి కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి కృషి చేద్దాం

కేవీపల్లె : బాలికల అభివృద్ధికి కృషి చేద్దామని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ అన్నపూర్ణ అన్నారు. బుధవారం మండలంలోని సొరకాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య, ఆరోగ్య, సమానత్వం, ఎదుగుదలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

నిమ్మనపల్లె : బాలికలు క్రమశిక్షణతో చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి మునివెంకటమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముష్టూరు కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో జాతీయ బాలికాదినోత్సవాన్ని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ భాను లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..2008లో జాతీయ బాలికా దినోత్సవాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రారంభించిందన్నారు. బాలురతో సమానంగా బాలికలను చూడాలన్నారు. ఆడపిల్లను రక్షించండి- ఆడపిల్లను చదివించండి నినాదాన్ని బాలికల తల్లిదండ్రులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్న మహిళల విజయాలను వివరించి బాలికల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

మదనపల్లె సిటీ : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ సుజాత అన్నారు. స్థానిక చంద్రాకాలనీలోని గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలిక విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ఉచిత విద్య, నిర్బంధ హక్కు, ఫోక్సో చట్టాలపై వివరించారు. నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న సంఘటనలు తెలియజేసి జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది రాధ, నరసింహులు, గురుకుల పాఠశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్రీలత, మోటివేటర్‌ రామమూర్తి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

కలకడ : మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శాంతి సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. బాల్యవివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం బాల్య వివాహాలను నివారిద్దాం-చదివిద్దాం అనే నినాదంతో బాలికలను ప్రోత్సహిద్దామని పిలుపునిచ్చారు. బాలికలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు.

రహదారి భద్రత సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న డీఎం ఆర్‌సీ నిరంజన్‌

మదనపల్లె సిటీ : రహదారి భద్రతా నియమాలు పాటించడం ప్రజలందరి బాధ్యత అని ఎంవీఐ శివలింగయ్య అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం డ్రైవర్ల దినోత్సవాన్ని స్థానిక ఆర్టీసీ-2 డిపో కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో మొబైల్‌ ఫోన్‌ ఉపయోగించరాదన్నారు. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌, ఇతర రహదారి నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. రవాణాశాఖ మార్గదర్శకాలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. అనంతరం బస్సు డ్రైవర్లకు రోజా పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంలు వెంకటరమణారెడ్డి, ఆర్‌సి నిరంజన్‌, మోటివేటర్‌ రామమూర్తి, సురేంద్ర, చైతన్య స్కూల్‌ ప్రిన్సిపాల్‌ విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే స్థానిక వన్‌ డిపోలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎం మూరే వెంకటరమణారెడ్డి డ్రైవర్లకు రోజా పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అధికంగా కెఎంపిఎల్‌ అధికంగా తెచ్చిన డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్‌ రవి పాల్గొన్నారు.

ప్రైవేట్‌ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి



ఆర్డీఓ ఎం.ఎస్‌.మురళికి వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్‌ పునీత్‌కుమార్‌

మదనపల్లె : పట్టణంలోని ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆస్పత్రులు వైద్యసేవలకు సంబంధించి పేద ప్రజల నుంచి లక్షల రూపాయలను దోపిడి చేస్తూ పెద్ద మాఫియాగా తయారయ్యాయని, వారి దోపిడీని అరికట్టాలని బహుజన యువసేన(బీవైఎస్‌) వ్యవస్థాపకులు జి.పునీత్‌కుమార్‌ కోరారు. మంగళవారం ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆస్పత్రుల దోపిడీ నుంచి పేద ప్రజలను కాపాడాలని ఆర్డీఓ ఎం.ఎస్‌.మురళికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్‌కుమార్‌ మాట్లాడుతూ... పట్టణంలో కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌ ఆస్పత్రులు తమ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందిస్తామని, పేదలను చేర్చుకుంటాయన్నారు. ఆపరేషన్‌కు అన్నీ సిద్ధంచేసి, మీకు ప్రభుత్వం నుంచి ఆరోగ్యశ్రీలో కొంత మొత్తం మాత్రమే వస్తుందని, మీరు ఇంకా చెల్లించాల్సి ఉంటుందని పేదలకు ప్రాణభయం పెట్టి నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. వైద్యసేవల పేరుతో జరుగుతున్న మోసాలన్నింటినీ అరికట్టి, పేదల ప్రాణాలకు భరోసా కల్పించాలని వినతిచేశారు.

ట్యాబ్‌ల వినియోగం వందశాతానికి పెంచాలి

రాష్ట్ర సమగ్ర శిక్ష కోఆర్డినేటర్‌ కిషోర్‌పాల్‌



ట్యాబ్‌ల వినియోగంపై ఆరాతీస్తున్న రాష్ట్ర సమగ్ర శిక్ష కోఆర్డినేటర్‌ కిషోర్‌పాల్‌

పీలేరు రూరల్‌ : ట్యాబ్‌ల వినియోగం వందశాతానికి పెంచాలని రాష్ట్ర సమగ్ర శిక్ష కోఆర్డినేటర్‌ కిషోర్‌పాల్‌ అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని జెడ్పీ మెయిన్‌ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా 6, 7, 8, 9 తరగతుల విద్యార్థుల అభ్యసనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు సంతృప్తికరంగా ఉందని, ట్యాబ్‌ల వినియోగం 50 శాతం మాత్రమే ఉందని, వందశాతానికి పెంచాలని కోరారు. ఏ వారంలో జరిగే సిలబస్‌ ఆ వారంలోనే ట్యాబ్‌లలో పిల్లలకు చూపించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ట్యాబ్‌లలో చాప్టర్స్‌ను పూర్తిగా చదవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష బైజుస్‌ జిల్లా కోఆర్డినేటర్‌ సుధాకర్‌, అశోక్‌రెడ్డి, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్‌ రెడ్డెప్ప, సీఆర్పీలు మురళీధర్‌ రాజు, నాగరాజు, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడానైపుణ్యాలు వెలికితీయడమే లక్ష్యం



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

పీలేరు : గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న క్రీడానైపుణ్యాలు వెలికితీయడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు మంచి అవకాశమని తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో క్రికెట్‌, వాలీబాల్‌, బ్యాడ్మింటన్‌ ఆటలకు సంబంధించి 20 జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. సర్పంచ్‌ జీనత్‌షఫీ, ఎంపీడీవోలు మురళీమోహన్‌రెడ్డి, గంగయ్య, వెంకటేష్‌, షబీర్‌, ఉపేంద్రరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్రాలో సత్తాచాటిన క్రీడాకారులు

నిమ్మనపల్లె : ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో మండల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరిచి సత్తా చాటారని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. బుధవారం మదనపల్లె జెడ్పీహైస్కూల్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఖోఖో మహిళల విభాగంలో విజేతలుగా ముష్టూరు గ్రామసచివాలయ క్రీడాకారులు నిలిచారన్నారు. అలాగే కబడ్డీ పురుషుల విభాగంలో నిమ్మనపల్లె-1 గ్రామసచివాలయం, ఖోఖో పురుషుల విభాగంలో కొండయ్యగారిపల్లె గ్రామసచివాలయాలు రన్నర్స్‌గా నిలిచాయన్నారు. విన్నర్స్‌గా నిలిచిన ముష్టూరు గ్రామసచివాలయానికి రూ.35 వేలు, రన్నర్స్‌గా నిలిచిన నిమ్మనపల్లె-1, కొండయ్యగారిపల్లె సచివాలయాలకు చెరో రూ.15 వేలు ప్రైజ్‌ మనీ అందజేసినట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

నిమ్మనపల్లె : గ్రామాల అభివృద్ధికి వార్షిక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఈఓపీఆర్డీ చలపతిరావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి ప్రణాళిక తయారీపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండలంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన పనులను గుర్తించి, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అందుకు అనుగుణంగానే అవసరమైన పనులను గుర్తించాలని అన్నారు. సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి బాట పట్టించేందుకు కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. అనంతరం స్థానిక సర్పంచ్‌లు ఈఓపీఆర్డీ చలపతిరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, మహదేవరెడ్డి, ఉషారాణి, రెడ్డెప్ప, వైఎస్సార్‌ సీపీ నాయకులు నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, నవీన్‌, చంద్ర, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలే సబ్‌ రిజిస్ట్రార్‌ ఆఫీసులు



జగనన్న ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్‌పై వీఆర్వోలకు శిక్షణ ఇస్తున్న ఇన్‌చార్జ్‌ సబ్‌రిజిస్ట్రార్‌ రాజు

మదనపల్లె : గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ ఆఫీసులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఇన్‌చార్జ్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ రాజు అన్నారు. ఈనెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పేదలకు 31లక్షల ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ మొదలుకానున్న నేపథ్యంలో సచివాలయ వీఆర్వోలకు బుధవారం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మినిస్ట్రేషన్‌ కార్యదర్శులను జాయింట్‌ సబ్‌ రిజిస్ట్రార్‌గా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న శాశ్వత స్థల హక్కు పథకం ద్వారా పేదలకు ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరిపేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిజిస్ట్రేషన్‌ వ్యవహారాలపై వీఆర్వోలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు హేమాంబరరెడ్డి, ముజీబ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : మండలంలోని గోపిదిన్నె కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సర్వే నరసింహారెడ్డి(72) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతుడికి నివాళులర్పించారు. కుటుంబీకులను ఓదార్చి పరామర్శించారు. పార్టీకి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం జుంజురపెంట గ్రామ సర్పంచు భూదేవి అనారోగ్యంతో ఉండటంతో ఆమెను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి,మల్లయ్యకొండ చైర్మన్‌ మల్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్‌ జగన్‌ను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

పీలేరు : అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వై.ఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డు ఆర్‌ఆర్‌ రెసిడెన్సీ ప్రాంతం, బండ్లవంక ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలు, పొందిన ఆర్థిక లబ్ధి కుటుంబాల వారీగా చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలో ఆనంద వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గత ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలతోపాటు ఎన్నో కొత్త పథకాలు అమలు చేసిన సీఎంను మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. స్థానికంగా ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

బాలికలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం జాతీయ బాలికా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడప్లిలలను రక్షించడానికి, ఆడపిల్లలను చదివించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్‌ జీనత్‌షఫీ, మహితా ఆనంద్‌, నాగరాజమ్మ, హుమయూన్‌, నారే వెంకటరమణారెడ్డి, నరసింహారెడ్డి, హబీబ్‌బాషా, ఉదయ్‌ కుమార్‌, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, నాగరాజ, కాటయ్య, కాలనీ చిన్న, మునీర్‌, షాకీర్‌ పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో బీసీలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

మదనపల్లె : వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తూ, రాజకీయంగా, సామాజికంగా సముచిత గౌరవం కల్పిస్తోందని బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కరనాయుడు, నియోజకవర్గ అధ్యక్షులు ఇస్మాయిల్‌, ఆంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. . రాష్ట్ర బీసీ కమిషన్‌ మెంబర్‌గా సవరంవారిపల్లెకు చెందిన జన్నే శేషాచలపతినాయుడును నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ పేదవర్గాలకు అన్నింటా పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకంగా పాలన సాగిస్తున్నారన్నారు. బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి, ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులాలపై అధ్యయనం చేసి, 139 బీసీ కులాలను వెలికితీసి, వాటికి 56 కార్పొరేషన్లు పెట్టి, బడుగు, బలహీనవర్గాల వారందరికీ చైర్మన్‌, డైరెక్టర్‌ పదవులు కట్టబెట్టారన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉండి చంద్రబాబునాయుడు తన జీవితకాలంలో ఏనాడు బీసీల గురించి, వారి సంక్షేమం గురించి ఆలోచించలేదన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు మాజీ ఎంపీటీసీ మల్లికార్జునాయుడు, మహేష్‌, ప్రభాకర్‌, రామకృష్ణ, శ్రీరాములునాయుడు, మస్తాన్‌, గోపాల్‌, మంజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కలకడ : ప్రభుత్వ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌ పాత్తూరి శ్రీకాంత్‌నాయుడు కోరారు. బుధవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో నిర్వహించిన వికసిత్‌ భారత్‌ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్రమోదీ రూ.436కే రూ.5లక్షల ప్రమాద బీమా, ఆడబిడ్డల భవిష్యత్తుకు సుకన్య సమృద్ధి యోజన, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, ఉచిత టీకాలు వంటివి అందిస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలనకు చేతివృత్తుల వారికి విశ్వకర్మయోజన, అమ్మ నీకు వందనం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆయుష్మాన్‌భవ, నూతన బియ్యం కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండలశాఖ అధ్యక్షుడు ఆంజినేయులు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

